క్లుప్తంగా

పంటల బీమాను సద్వినియోగంచేసుకోండి



గొల్లుపాలెంలో జీడిమామిడి తోటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ రాజశేఖర్

బొండపల్లి: వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గజపతినగరం సబ్ డివిజన్ ఉద్యాన వన శాఖాధికారి(హెచ్‌ఓ) ఏ.రాజశేఖర్ రైతులకు సూచించారు.మండలంలోనిగొల్లుపాలెం, దేవుపల్లి తదితర గ్రామాల్లో జీడిమామిడి రైతులకు వాతావరణ ఆధారిత బీ మా పథకంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎకరానికి రూ.1,500 చొప్పున ప్రీమియం చెల్లించాలని చెప్పారు. పంటకు నష్టం వాటిల్లితే రూ.30 వేల వరకు బీమా వస్తుందన్నారు. రైతులు తమ భూముల వన్‌బీ, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా తీసుకుని తమ పరిధిలోని రైతు సేవ కేంద్రాల్లో లేదా మీసేవా కేంద్రాల్లో కానీ ఈనెల 15వ తేదీలోగా వివరాలు నమోదు చేసుకుని, ప్రీమియం చెల్లించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షిస్తే అవార్డులు



గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రాణిశ్రీ, గోవిందరాజులు

చీపురుపల్లి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించిన విద్యార్థులకు తమ సంస్థ ఆధ్వర్యంలో అవార్డులు ఇవ్వనున్నట్లు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు తెలిపారు. పట్టణంలోని బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఏ.రాణిశ్రీతో కలిసి మంగళవారం 30 మొక్కలు నాటారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలను ఆరోతరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులకు అప్పగించారు. విద్యార్థినులు పదో తరగతి వరకు వారికి కేటాయించిన మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రసాదరావు, యు.హరి, పి.రవి, కిశోర్ పాల్గొన్నారు.

బాలాంజనేయుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న బాలాంజేయస్వామి

వేపాడ: మండలంలోని రామస్వామిపేట అభయ బాలాంజనేయస్వామి ఆలయంలో నాగులచవితిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారిని సిందూరం, వివిధ పుష్పాలతో అలంకరించారు. భక్తులతో అష్టోత్తర శతనామ పూజ చేయించారు.

మద్యం సీసాల స్వాధీనం

గంట్యాడ: మండలంలోని పెంట శ్రీరాంపురం గ్రామంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వజ్జపు గోపాలరావు అనే వ్యక్తిని సీఐ ఇందిరాదేవి, ఎస్ఐ రామారావు అదుపులోకి తీసుకుని, నిందితుడి నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

పశువుల సంచారంపై నిఘా..


విజయనగరం: ప్రధాన రహదారులపై విచ్చలవిడి పశు సంచారాన్ని సహించబోమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద ప్రధాన కాలువలపై పలువురు దుకాణదారులు పలకలు వేయడాన్ని గమనించారు. తక్షణమే ఆ సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శిని పిలిచి వివరణ కోరారు. పలకలు వేయడం వల్ల కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వస్తోందని, వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం దాసన్నపేట, తదితర ప్రాంతాల్లో పర్యటించి రహదారులపై పశువుల సంచారాన్ని గమనించారు. పశు పెంపకందారులను పిలిచి తక్షణమే పశువులను ప్రత్యేక ప్రాంతాలకు తరలించాలని, రహదారులపై విడిచిపెడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి.. తెగుళ్ల దాడి

- పొట్టదశలో వరి పంటకు అందని నీటితడులు
- వరుణుడు కరుణించక, సాగునీటి కాలువల నుంచి నీరందక రైతుల అవస్థలు
- విజృంభిస్తున్న మానిపండు, ఇతర తెగుళ్లు
- గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో 2వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లే అవకాశం



మెంటాడ మండలంలోని మీసాలపేటలో చెరువు నుంచి ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడుతున్న రైతులు



గజపతినగరం మండలం మధుపాడలో నీటి తడులు అందక బీటలు వారుతున్న పంట పొలం (ఇన్‌సెట్లో) మాని పండు తెగులు ఆశించడంతో నల్లగా మారిన వరి కంకులు

బొండపల్లి: ఈఏడాది ఖరీఫ్ వరి సాగు రైతులకు అంత ఆశాజనకంగా లేదు. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని బొండపల్లి, గజపతి నగరం,దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లో బోరు బా వులు ఉన్నచోట తప్ప మిగతా చోట నాట్లు ఆలస్యమయ్యాయి. చాలా గ్రామాల్లో ఆగస్టు నెలా ఖరు వరకు ఉభాలు జరిగాయి. అప్పటి కే నారు ముదురిపోయింది. గత్యంతరం లేక ఆ నారుతోనే నాట్లు వేశారు.గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదైంది. దీంతో వర్షాధారంగా సాగు చేస్తున్న చోట పంటకు నీటి తడులు అందక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం పంట చిరుపొట్ట, కంకుల దశలో ఉంది. పంట ఎండిపో కుండా రైతులు పొలాలకు దూరంగా ఉన్న చెరువుల నుంచి ఆయిల్ ఇంజిన్లతో నీటి తడులు అందించి కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఆంధ్ర,తాటిపూడి రిజర్వాయర్, బి.వి. ఛానల్,13 వంతుల కాలువ నుంచి పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. నీటితడులు సరిపడా అందకపోవడంతో పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి.సుడి దోమ, మాని పండు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు అంటున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గజపతినగరం డివిజన్ పరిధిలో ఆలస్యంగా నాట్లు వేసిన 13వేల హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 2వేల ఎకరాల వరకు పంట ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



1121 రకం వరిని ఎక్కువగా తెగుళ్లు ఆశిస్తున్నాయి.రైతులు అప్రమత్తంగా ఉంటూ సకాలంలో తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు పాటించాలి. వరి కంకులు వచ్చే దశలో మానిపండు (కాటుక) తెగులు సోకే అవకాశం ఉంది. పంట దిగుబడిపై ఈ తెగులు తీవ్రప్రభావం చూపిస్తుంది. నివారణకు ప్రాఫికొనజోల్ 25 ఈసీ మందును లీటరు నీటికి మిల్లీలీటర్ కలిపి పిచికారీ చేయాలి.

– కె.మహరాజన్, గజపతిగనరం ఏడీఏ

ఘనంగా నాగుల చవితి వేడుకలు

నాగుల చవితి వేడుకలను మంగళవారం వాడవాడలా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. కుటుంబాలతో కలిసి పొలాలు, తోటల్లోని పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతకు పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి, నువ్వులతో చేసిన చిమ్మిడి, చలివిడి, కోడిగుడ్లు వేసి చల్లగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. అనంతరం పుట్టల వద్ద బాణసంచా కాలుస్తూ సందడి చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



దత్తిరాజేరు: పెదమానాపురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



గంట్యాడ: పెదవేమలి గ్రామంలో పుట్టలో పాలుపోస్తున్న మహిళలు



చీపురుపల్లి: చీపురుపల్లిలో పుట్టలో పాలుపోస్తున్న జెడ్పీటీసీ శిరీష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసనాయుడు



చీపురుపల్లి: రామలింగాపురంలో నాగదేవతకు పూజలు చేసేందుకు వెళుతున్న గ్రామస్తులు



వేపాడ: వేపాడలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న ప్రజలు



బొండపల్లి: కొవ్వాడపేటలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు



గజపతినగరం: పుట్టలో పాలు పోసేందుకు వెళుతున్న గజపతినగరం వాసులు



మెరకముడిదాం: సోమలింగాపురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



వేపాడ: బొద్దాంలో నిర్వహించిన చవితి వేడుకల్లో కోలాటం ఆడుతున్న మహిళలు

పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించుకుందాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించుకునేందుకు అందరూ ఐకమత్యంతో పని చేయాలని ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులకు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కొత్తవలసలోని పార్టీ క్యాంప్ ఆఫీస్‌లో నియోజకవర్గ పరిధిలోని ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ ముఖ్యనాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టే అభ్యర్థి గెలుపు కోసం సీనియర్ నాయకులు తమ సూచనలు, సలహాలు ఇచ్చి పార్టీకి సహకారం అందివ్వాలని కోరారు. పార్టీని మళ్లీ బలోపేతం చేసేందుకు, ప్రజల గొంతు చట్టసభల్లో వినిపించేందుకు ఈ విజయం మనకు అవసరమని అన్నారు. సమా వేశంలో మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎస్.నాయుడుబాబు,డీసీసీబీ మాజీ చైర్మన్ వి.చిన రామునాయుడు, ఎంపీపీలు ఎస్.గోపమ్మ, గేదెల శ్రీని వాసరావు, దొగ్గ సత్యవంతుడు, సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీలు ఎం.వెంకటలక్ష్మి, తూర్పాటి వరలక్ష్మి, శానాపతి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, నాయ కులు గొర్లె రవికుమార్, ఒబ్బిన నాయుడు, ఎం.జగన్నాథం, మోపాడ కుమార్, వాకాడ రాంబాబు, కె.సూర్యనారాయణరాజు, గొరపల్లి శివ, కర్రి శ్రీను, పినిశెట్టి వెంకటరమణ తదితరులు కార్యకర్తలు హాజరయ్యారు.

భక్తి శ్రద్ధలతో గౌరమ్మ సంబరం



మండపం వద్ద దాటుభజన చేస్తున్న వేపాడ, వల్లంపూడి భజన బృందాలు



వల్లంపూడిలో పూజలందుకుంటున్న గౌరీపరమేశ్వరులు

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో నాగుల చవితి సందర్భంగా మంగళవారం సాయంత్రం గౌరమ్మ సంబరం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గౌరీ,పరమేశ్వరుల మండపంలో ఉదయం నుంచి జంట గ్రామాలై న వేపాడ,వల్లంపూడికి చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందాలు భజన చెట్టు ఏర్పాటు చేసి దాటుభజన చేశారు. గౌరమ్మ ఉత్సవాలు ఒక ఏడాది వేపాడలో గుత్తివారి కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహిస్తే, తర్వాత ఏడాది వల్లంపూడిలోని మాదన వారి కుటుంబ ఆధ్వర్యంలో నిర్వహించ డం పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈఏడాది వల్లంపూడిలో అక్టోబర్ 16న గౌరీ పరమేశ్వరుల విగ్ర హాలను ప్రతిష్ఠించారు. నాటి నుంచి నిత్య పూజలు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ వరకు పూజలు కొనసాగుతాయని, కార్తీక పౌర్ణమి రోజున నిమజ్జనోత్సవం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

నేడు రక్తదాన, నేత్ర వైద్యశిబిరాలు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ జ్ఞాపకార్థం పట్టణంలోని జి.అగ్రహారంలో బుధవారం మెగా రక్తదాన, నేత్రవైద్యశిబిరాల నిర్వహణతో పాటు మొక్కల పంపిణీ చేయనున్నట్లు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులు మంగళ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన రమణ తన సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ఆయన జ్ఞాపకార్థం మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత రక్తదానం చేసి రమణకు ఘన నివాళి అర్పించాలని కోరారు.

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



చీపురుపల్లి: కర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి సువర్ణకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు



శృంగవరపుకోట: కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారికకు వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది



మెరకముడిదాం: మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారి అజిత్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

తమ సమస్యలను పరిష్కరించాలని 104 వైద్య సేవల ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు చీపురు పల్లి, శృంగవరపుకోట, మెరకముడిదాం మండలాల్లో 104 ఉద్యోగులు పీహెచ్‌సీల వైద్యాధికారులకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరమవుతోందన్నారు. 104 సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2020 తరువాత విధుల్లో చేరిన సిబ్బందికి జీఓ నంబర్ 7ద్వారా వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్ చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా ఎంపిక కమిటీ ద్వారా నియమితులైన 104 వాహన డ్రైవర్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు.

– చీపురుపల్లి/శృంగవరపుకోట/మెరకముడిదాం

వైభవం.. నందెన్న అనుపోత్సవం



గుర్ల: పెద్దబంటుపల్లిలో గౌరమ్మ, నందెన్నల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో గౌరమ్మ ఉరేగింపు



దత్తిరాజేరు: ఎస్.చింతలవలసలో నందెన్న ఊరేగింపు



గజపతినగరం: ముచ్చర్లలో నందెన్న అనుపోత్సవంలో జెడ్పీటీసీ తవుడు

చీపురుపల్లి పట్టణంలోని పిల్లపేట, రుంకానవీధిలో, గుర్ల మండలంలోని పెద్దబంటుపల్లిలో, దత్తిరాజేరు మండలంలోని కోమటిపల్లి, పెదమానాపురం, ఎస్.చిం తలవలస, కె.కొత్తవలస, కె.కృష్ణాపురం, గజపతినగరం మండలంలోని ముచ్చర్ల గ్రామంలో నందెన్న అనుపోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. చీపురుపల్లి పట్టణంలోని పిల్లపేట, రుంకానవీధిలోనాగుల చవితికి 21రోజుల ముందే గౌరమ్మ,నందెన్న విగ్రహాలను కొలువు దీర్చి నిత్యపూజలు చేశారు.కొన్ని గ్రామాల్లో దీపావళి రోజున గౌరమ్మ, నందెన్న విగ్రహాలను ప్రతిష్టించి అయిదురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. మేళతాలాలు, డప్పు వాయిద్యాలు, కోలాటం, యువత నృత్యాల మధ్య అనుపోత్సవం సందడిగా సాగింది.

– చీపురుపల్లి/గుర్ల/దత్తిరాజేరు/గజపతినగరం

శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ

గజపతినగరం: శిశువుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎస్.సూర్యనారాయణ సూచించారు. మం డలంలోని మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ డే కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈసం దర్భంగా మాట్లాడుతూ నవజాత శిశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరమని, శిశువులకు న్యుమోనియా రాకుండా చూసు కోవా లని, ఏమైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యం అందించేలా చూడాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. జిల్లాలోని పలు గ్రా మాల్లో ప్రజలు ఇటీవల డయేరియా బారినపడ్డారని, మండలంలో డయేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యజాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయికృష్ణారెడ్డి, సుష్మ, సీహెచ్‌ఓలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

గంట్యాడ: మండల కేంద్రంలో నేచర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్, కిశోర బాలికల ఆరోగ్యంపై కళాజాత బృందం మంగళవారం అవగాహన కల్పించింది. హైచ్ఐవీ ఎలా సక్రమిస్తుందో, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేచర్ సంస్థ ప్రతినిధి బంగారుబాబు మాట్లాడుతూ 14 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉన్న యువత ఎక్కువగా హెచ్ఐవీ బారిన పడుతున్నారన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడితే జీవిత కాలం పెంచుకోవచ్చని చెప్పారు. 1097 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే హెచ్ఐవీకి సంబంధిం చిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపవద్దని, వారిని అవమానించవద్దని అన్నారు. కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే ఆశ , అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్‌ఎంలకు తెలియజేయాలని సూచించారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. కలెక్టరేట్‌లో సఖీ కార్నర్ ఏర్పాటు చేశారని, కిశోర బాలికలు వారికి అవసరమైన కౌన్సిలింగ్, టెలిమెడిసిన్ సేవలు ఉపయోగించుకోవాలని చెప్పారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



భగవతీ నృత్యకళామందిర్ చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: పట్టణంలోని మూడులాంతర్లు వద్దనున్న పైడితల్లి చదురుగుడి ఆవరణలో మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ నృత్య కళాకారిణి భగవతీ నృత్యకళామందిర్ వ్యవస్థాపకురాలు వడ్లమాని రమణకుమారి శిష్యబృందం నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. అమ్మవారిని కీర్తిస్తూ చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.